ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 21 ఆగస్టు 2024





వేలం బహిష్కరించి మార్కెట్‌లో ఉన్న బయ్యర్లు

అన్యాయం అని రోడ్డెక్కినవారు అదృశ్యమయ్యారు. అనంతపురం వేరే దేశంలో ఉందా అని ఆవేదన వ్యక్తం చేసినవారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీనిపై కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో రకరకాల ప్రచారాలు, చర్చలు జరుగుతున్నాయి. అసోసియేషన్లు ఎప్పటిలాగే వసూళ్లను కొనసాగించాయి. ఈ వివాదాల నడుమ బయ్యర్లు మంగళవారం మార్కెట్‌ను బహిష్కరించారు. అసోసియేషన్ సభ్యులు భయపెట్టడంతో టమోటా కొనుగోలు తమ వల్ల కాదని చేతులెత్తేశారు. దీంతో టమోటా రైతులు దిక్కుతోచక ఉదయమే రోడ్డెక్కారు. వెరసి.. 44వ నంబరు జాతీయ రహదారిపై రాకపోకలు రెండో రోజు కూడా స్తంభించాయి. 'మాఫియా' గుప్పిట ఉన్న మార్కెట్‌కు స్వేచ్ఛ లభించడం సాధ్యమేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. కారణం.. జిల్లా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండటమే. జిల్లా కేంద్రం శివారులో రైతులు గోడోమంటున్నా.. కలెక్టర్ లాంటి సర్వోన్నతాధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. హైవేపై వాహనాల రాకపోకలు స్తంభించడంతో.. తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు అక్కడికి వచ్చినట్లు కనిపిస్తోంది. అక్రమ వసూళ్లకు వ్యతిరేకంగా సోమవారం గళం విప్పిన కొందరికి ఓ డీఎస్పీస్థాయి అధికారి పేరిట అసోసియేషన్ నుంచి బెదిరింపు కాల్స్ వెళ్లాయని సమాచారం. దీంతో రాత్రికి రాత్రే ఐదారుగురు బయ్యర్లు నగరం విడిచి వెళ్లిపోయారని సమాచారం.



వేలం లేకపోవడంతో మార్కెట్‌లో ఉండిపోయిన టమోటా



రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ

మార్కెట్‌లో.. మాఫియా హీట్

- కొనసాగిన బెదిరింపులు.. వసూళ్లు
- వేలాన్ని బహిష్కరించిన బయ్యర్లు
- దిక్కుతోచక రోడ్డెక్కిన టమోటా రైతులు
- భయపడి పారిపోయిన ఐదారుగురు వ్యాపారులు

అనంతపురం రూరల్, ఆగస్టు 20: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం వేలం నిలిచిపోయింది. వ్యాపారులు వేలాన్ని బహిష్కరించారు. మార్కెట్‌లోని కొన్ని మాఫియా శక్తుల బెదిరింపులు, బరితెగింపులు దీనికి కారణమని బాధితులు మండిపడుతున్నారు. ది అనంతపురం హెవీ గూడ్స్ లారీ అసోసియేషన్, మండి అసోసియేషన్లు అనుసరిస్తున్న వైఖరితో తాము నష్టపోతున్నామని వ్యాపారులు, రైతులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లు, బయ్యర్లకు బెదిరింపులతో మార్కెట్‌లో భయానక వాతావరణం నెలకొంది. రక్షణగా ఉంటారనుకున్న పోలీసుల పేరిటా బెదిరింపులు రావడంతో కొందరు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. వేలంపాటలు నిలిచిపోవడంతో మార్కెట్‌కు వచ్చిన రైతులు ఒక్కసారిగా బెంగళూరు-హైదరాబాదు జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం బైఠాయించారు. అన్నదాతల ధర్నాతో హైవే దద్దరిల్లింది. వాహనాల రాకపోకలు గంటకుపైగా నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. కానీ వారు వినులేదు. రేయింబవళ్లు శ్రమించిన పండించిన పంటను కొనుగోలు చేయకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని, టమోటా దిగుబడులను దిబ్బల్లో పారేయాల్సి వస్తుందని వాపోయారు. అసోసియేషన్ల అక్రమాలకు తాము బలిపశువులు అవుతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. 'వ్యాపారుల నుంచి అసోసియేషన్లవారు రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారు. ఈ కారణంగా వారు మా సరుకును తక్కువ ధరకు కొంటున్నారు. పంట పండించేందుకు మేము ఎంత కష్టపడుతున్నామో తెలుసా..? నిమిషాల వ్యవధిలో మా కష్టాన్ని దోచుకుంటున్నారు. కలెక్టర్‌ను రమ్మనండి. ఆయనతోనే మాట్లాడుతాం. జిల్లా కేంద్రంలోనే ఇంత బరితెగింపా..? అసోసియేషన్‌లకు డబ్బులెందుకు కట్టాలి..? ఏ హక్కుతో వారు డబ్బులు వసూలు చేస్తున్నారు..?' అని రైతులు మండిపడ్డారు. 'డబ్బులు వసూలు చేసుకుని ఎవడెవడో బాగుపడుతున్నాడు. మేం సర్వనాశనం అయిపోతున్నాం..' అని ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగు గోడల మధ్య చర్చలు

పోలీసు అధికారులు రైతులకు నచ్చజెప్పి చర్చల పేరిట మార్కెట్ వద్దకు తీసుకెళ్లారు. ఓ మండీ గదిలోకి హెవీ గూడ్స్ లారీ అసోసియేషన్, మండీ అసోసియేషన్, రైతులు, నలుగురైదుగురు బయ్యర్లు డీఎస్పీ టీవీవీ ప్రతాప్ సమక్షంలో చర్చలు జరిపారు. కానీ సఫలం కాలేదు. డబ్బులు వసూలు చేయవద్దని లారీ అసోసియేషన్ సభ్యులకు డీఎస్పీ గట్టిగా సూచించారని సమాచారం. ఇంతలో టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. మొదట టమోటాల వేలం పూర్తి చేయాలని, సమస్యలపై తరువాత చర్చించుకుందామని అన్నారు. దీంతో అక్కడి నుంచి అందరూ వెళ్లిపోయారు.

ముగ్గురి రాజ్యం..?

టమోటా మార్కెట్ తమ కనుసన్నల్లో నడవాలని మండీ అసోసియేషన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కథ నడిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ముగ్గురే బయ్యర్లను తీవ్రంగా భయపెట్టినట్లు సమాచారం. జాతీయ రహదారిపై సోమవారం ఆందోళనకు దిగిన బయ్యర్లు మంగళవారం ఆ ప్రాంతంలో కనిపించకపోవడం గమనార్హం. వారికి ఫోన్ చేసి 'నరుకుతాం..' అని తీవ్రంగా బెదిరించారని ప్రచారం జరుగుతోంది. దీంతో రాత్రికి రాత్రే ఐదారుగురు బయ్యర్లు మార్కెట్ వదిలి వెళ్లినట్లు సమాచారం. మార్కెట్‌లో బయ్యర్లకు కనీస మర్యాద దక్కడం లేదు. 'ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. బెదిరిస్తున్నారు..' అని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. 'వసూళ్లు శ్రుతిమించాయి. వేలకు వేలు ఎక్కడి నుంచి తెచ్చివ్వాలి..? అయినా కిమ్మనకుండా ఇస్తున్నాం. డబ్బులు తీసుకుని బెదిరిస్తున్నారు. మా సమస్యను ఎవరికి చెప్పుకోవాలి..?' అని కంటతడి పెట్టుకున్నారు.

112 టన్నుల టమోటా నో సేల్

మార్కెట్‌లో ఆందోళనల కారణంగా 112 టన్నుల టమోటా నోసేల్ కింద పడిపోయాయి. మార్కెట్ ఉదయం 6:30గంటలకు ప్రారంభం కావాల్సిన టమోటా వేలం 10:30గంటలకు ప్రారంభమైంది. అప్పటికే నాలుగు గంటల సమయం గడిచిపోయింది. ఈ క్రమంలో బయ్యర్లు ఆక్షన్‌ను బహిష్కరించడంతో వేలం ఆలస్యమైంది. అసలే వర్షాలకు కాయలు దెబ్బతింటున్నాయి. దీంతో సాధారణ ధరకంటే తక్కువ ధరకు కాయలు అమ్ముడుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌కు 3,750 టన్నుల కాయాలు రాగా.. ఇందులో 112 టన్నులు నోసేల్ కింద పడిపోయాయి. అంటే 1.12 లక్షల కిలోల టమోటా వేలంలో అమ్ముడుపోలేదన్నమాట. కిలో రూ.5 చొప్పున అమ్ముడుపోయినా.. రైతులకు కొంతలో కొంతైనా ఊరటగా ఉండేదీ. నో సేల్ కారణంగా రైతులకు పైసా కూడా దక్కకుండా పోయింది.

వసూళ్లపై కలెక్టర్ ఆరా..?

టమోటా మార్కెట్‌లో లారీ అసోసియేషన్, మండీ అసోయేషన్‌ల అక్రమ వసూళ్లపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆరా తీసినట్లు తెలిసింది. ఎవరు డబ్బులు వసూలు చేస్తున్నారు, ఎందుకు వసూలు చేస్తున్నారని ఆయన అధికారులను అడిగినట్లు తెలిసింది. వసూళ్ల వెనుక ఎవరున్నారు..? బెదిరిస్తున్నది ఎవరు అని ఆరా తీసినట్లు సమాచారం. కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు జోక్యం చేసుకుంటే మార్కెట్‌లో సమస్యలు పరిష్కారమౌతాయని రైతులు అంటున్నారు.

రైతులు ఇబ్బంది పడకూడదు: పరిటాల శ్రీరామ్



మార్కెట్‌లో అసోసియేషన్లకు, బయ్యర్లకు మధ్య సమస్యలు ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో రాజకీయ నాయకులు, ఇక్కడి నాయకుల కారణంగా కొన్ని పద్ధతులు మొదలయ్యాయి. అసోసియేషన్లవారు, బయ్యర్లు లాభాలకోసం పనిచేస్తారు. కానీ రైతులు పరిస్థితి వేరు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పంటలు పండిస్తారు. వ్యయప్రయాసల కోర్చి టమోటాను మార్కెట్‌కు తెస్తారు. వేలం జరగకపోతే తీవ్రంగా నష్టపోతారు. వారికి ఇబ్బంది లేకుండా మొదట వేలం వేయమని చెప్పాము.

వేలకు వేలు ఎక్కడి నుంచి తెస్తాం..?



లారీ అసోసియేషన్ రూ.2,500 వసూలు చేస్తోంది. మరో అసోసియేషన్ రూ.500, ఇంకొకటి రూ.200 గుంజుతోంది. ఇంత సొమ్ము ఎలా కట్టేది..? ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారు. దీంతో కొంత మంది రాత్రి మార్కెట్ నుంచి వెళ్లిపోయారు. వసూళ్లను నిలుపుదల చేస్తే బాగుటుంది.

- రఫీ, టమోటా వ్యాపారి

మేం చావాల్సిందే..



అసోసియేషన్ల అక్రమ వసూళ్లతో మార్కెట్‌లో రెండురోజులుగా రైతులు నానా అవస్థలు పడుతున్నాము. అసోసియేషన్లకు రూ.5వేలు.. రూ.10 వేలు కట్టలేమని బయ్యర్లు అంటున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతామని అంటున్నారు. అయినా అసోసియేషన్‌లు మారడం లేదు. పోలీసులు కూడా వారికే వత్తాసు పలుకుతున్నారు. మాకు కడుపు మండి రోడ్డుపైకి వచ్చాం. పరిస్థితి ఇలాగే ఉంటే టమోటా రైతులు చావాల్సిందే.

- తిమ్మప్ప, రైతు, రాంపురం

ఎవరికీ పట్టడం లేదు..



మార్కెట్‌లో రైతు కష్టాలు ఎవరికీ పట్టడం లేదు. నో సేల్ అంటున్నారు. కాయలు అమ్ముడుపోక మేము ఇబ్బంది పడుతుంటే పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేయాలంటూ మమ్మల్ని రోడ్డుపై నుంచి లాగేస్తున్నారు. బయ్యర్లు వేలం పాడేది లేదంటున్నారు. మా గోడు ఎవరితో చెప్పుకుంటే తీరుతుంది..?

- పవన్, రైతు, కాటిగానికాలవ

మా గతేమిటి..?



కూలీలకు ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చి కాయలు కోసి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ఇక్కడ కాయలు కొనకుండా బండ్లోళ్లని మల్లగొడుతున్నారు. ఇట్లయితే మా గతేమిటి..? మార్కెట్‌లో మూడు లక్షల బాక్సులుంటే ఒక్క బాక్సు కొనేవాడు లేదు. బయ్యర్లు కొనుగోలు చేసేందుకు రావడం లేదు. ఈ తిప్పలు ఎవరికీ రాకూడదు.

-ఖలందర్, రైతు, పీఆర్ కొట్టాల, కళ్యాణదుర్గం

విచారణ జరిపించాలి: రాంభూపాల్

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. డీఆర్వో రామకృష్ణారెడ్డిని మంగళవారం కలసి వినతిపత్రం ఇచ్చారు. రెండు మూడు రోజులుగా కక్కలపల్లి మార్కెట్ వద్ద రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. మార్కెట్‌లో వ్యాపారులు, లారీ అసోసియేషన్ మధ్య విభేదాలు రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టమోటా కొనుగోలులో కొందరి పెత్తనం జరుగుతోందని, లారీ అసోసియేషన్ పేరుతో రూ.2,500, మండీల నిర్వహణ పేరిట రూ.500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



డీఆర్ఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆరోపణలున్నా అందలం

- సీఐల బదిలీల్లో సిఫార్సుల తఖరారు
- వైసీపీతో అంటకాగిన వారికీ పెద్దపీట
- కొన్నిచోట్ల పనిచేయని ప్రజాప్రతినిధుల లేఖలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- కొన్ని స్టేషన్లకు పైసల డిమాండ్

అనంతపురం క్రైం,ఆగస్టు 20 : ఉమ్మడి జిల్లాల పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెకర్ల బదిలీల విషయంలో సిఫార్సులు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని చోట్ల తఖరారు నెలకొంది. ప్రజాప్రతినిధులు కొందరు లేఖలు పంపినా వాటిని అధికారులు లెక్కచేయలేదని తెలుస్తోంది. కొందరు సీఐల పేర్లు ఉంటాయని భావించినా వాటిని కనీసం జాబితాలోకి చేర్చలేదని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులకు టీడీపీ ముద్ర వేసి పక్కన పెట్టేశారు. కానీ తాజా సీఐల బదిలీల్లో వైసీపీకి అంటకాగిన వారికి సైతం నచ్చిన పోలీస్‌స్టేషన్లు అప్పగించారనే ఆరోపణలున్నాయి. అదే క్రమంలో టీడీపీకి మద్దతుగా నిలిచిన అధికారులకు ప్రాధాన్యత ఇవ్వలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 45 మందికి పైగా సీఐలను బదిలీ చేసినా ఇంకా కొన్ని అలాగే ఉంచారు. ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖలు పంపినా అధికారులు కొన్ని స్టేషన్ల విషయంలో తిరస్కరించినట్లు తెలుస్తోంది.

ఆ పేర్లు తిరస్కరణ

పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసరే (ఎస్‌హెచ్‌ఓ) కీలకం. ఆ పోస్టు సీఐ స్థాయి అధికారిది. అనంతపురంలో నగరంలోనూ గతంలో ఎస్‌ఐ స్థాయి అధికారులు సైతం ప్రభావం చూపగలిగారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. రూరల్‌తో కలిసి వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ సీఐలదే హవా. దీనికితోడు జిల్లా కేంద్రం కావడంతో అనంతపురంతో పాటు సమీపంలోని పోలీస్‌స్టేషన్లకు సీఐ పోస్టులకు డిమాండ్ ఉంటుంది. ఇక అనంతపురం వన్‌టౌన్ ఎప్పుడూ హాట్‌సీటే. అంతమంది సీఐల బదిలీలు జరిగినా ప్రస్తుతమున్న సీఐ రెడ్డెప్ప రిలీవ్ అయినా ఆ స్టేషన్‌కు ఇంకా సీఐను నియమించకపోవడం గమనార్హం. ఈ స్టేషన్‌కు సీఐగా రాజా పేరుతో అధికారులకు సిఫార్సులు అందాయి. దాదాపు ఆయనే ఖరారవుతారని భావించినా అధికారులు పలు కారణాలు చూపి తిరస్కరించినట్లు సమాచారం. దీంతో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య (ప్రస్తుతం వీఆర్), రాజేంద్రనాథ్‌యాదవ్ (ప్రస్తుతం కళ్యాణదుర్గం రూరల్) పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా శింగనమల నియోజకవర్గంలోనూ బుక్కరాయసముద్రం, శింగనమల విషయాల్లోనూ ఇదే పరిస్థితి. తొలుత పంపిన పేర్లను తిరస్కరించినట్లు సమాచారం. ఆ నియోజకవర్గంలో తాజాగా ఓ మండలానికి కేటాయించిన ఎస్‌ఐ విషయంలోనూ రాజకీయ తకరారు జరిగినట్లు సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుకొండకు కియ కంపెనీ ఏర్పాటు అనంతరం డిమాండ్ పెరిగిందని పోలీస్ వర్గాలే చెబుతున్నాయి. పెనుకొండ సీటు కోసం ఓ అధికారి విశ్వప్రయత్నాలు చేశారు. మొదట ఓకే అయినా చివరలో ఎక్కువ మండల పరిధి, గ్రామాలున్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని సమాచారం. అటు హిందూపురం, ధర్మవరం పరిధిలో సిఫార్సులే ఎక్కువ పనిచేసినట్లు తెలుస్తోంది.

ఆ ముగ్గురి చేతిలోనే జాబితా..

తాజాగా జరిగిన సీఐల బదిలీల్లో వైసీపీకి అంటకాగిన వారికీ అధిక ప్రాధాన్యత కల్పించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గత ప్రభుత్వంలో వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిలో అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది. రాయలసీమ పరిధిలో సీఐల పోస్టింగ్‌లకు సంబంధించి ఓ రిటైర్డ్ డీఎస్పీకి, ఓ డీఎస్పీ, సీఐకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ప్రజాప్రతినిధుల లేఖల ద్వారా సంబంధిత డీఐజీలకు జాబితాను వారే పంపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కొందరికి మోదం, కొందరికి ఖేదం కలిగినట్లు తెలుస్తోంది. ఇదివరకు శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేసిన ఇద్దరు సీఐలకు వైసీపీ వీరాభిమానులు అనే ముద్ర ఉంది. కానీ తాజా బదిలీల్లో వారు అనంతపురం సమీప స్టేషన్లలోకి వచ్చేశారు. ఓ సీఐ నగరంలోని రెండు పోలీస్‌స్టేషన్లలో పనిచేయడంతో పాటు ఎస్పీలోకి వచ్చి టీడీపీ మద్దతుదార్లంటూ ఎన్నికల ముందు కొందరు సిబ్బందిని స్టేషన్లలో లేకుండా పంపేశారు. అలాంటి అధికారిని ఇప్పుడు వీఆర్‌కు తీసుకొచ్చారు. మళ్లీ ఏ విభాగం అప్పగించడానికంటూ ప్రశ్నిస్తున్నారు.



నగరంలో గత ఏడాది ట్రాఫిక్‌లో పనిచేసిన సీఐకు, పోలీస్‌కంట్రోల్ రూమ్ విభాగంలో ప్రస్తుతం పనిచేస్తున్న సీఐలకు టీడీపీ ముద్ర వేశారు. కానీ వారికి ఎక్కడా పోస్టింగులు ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి జాబితా ఇంకా ఉందని, మరో బదిలీల జాబితాలోనైనా చోటు కల్పిస్తారో లేదననే ఆందోళన వారిలో నెలకొంది.

కొన్ని స్టేషన్లకు పైసల డిమాండ్

అవినీతి ఆరోపణల్లో జోరుగా ఉన్న వారికి సైతం పోలీస్‌స్టేషన్లు కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏసీబీలో ఉంటూ ఓ అధికారి వైసీపీ హయాంలో నాలుగేళ్లపాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఏసీబీ పేరుతో అవినీతి అధికారులను భయపెట్టి బాగానే వసూలు చేశారు. ఈయనకు ఇప్పుడు శ్రీసత్యసాయి జిల్లాలో ఓ పోలీస్‌స్టేషన్ అప్పగించారు. ఖాకీ చొక్కా పడితే ఈయన మరింత రెచ్చిపోతారని భావిస్తున్నారు. అనంతపురం సమీపంలోకి వచ్చిన ఇద్దరు సీఐలదీ అదే పరిస్థితని సమాచారం. శ్రీసత్యసాయి జిల్లాలో ఓ సీటుకు రూ.30లక్షలు డిమాండ్ పలికినట్లు సమాచారం. ముఖ్యంగా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో పట్టణ ప్రాంతాలు, అధిక లాభాలున్న స్టేషన్లకు ఈ వ్యవహారం బాగా జరిగినట్లు సమాచారం. కొందరు నేతల సిఫార్సుతో వెళ్లగా మరికొందరు తమకు కావాల్సిన స్టేషన్ కోసం పైసలు ముట్టజెప్పినట్లు సమాచారం.

హంద్రీనీవాకు పైపింగ్



కాలువలో ఏర్పడిన పైపింగ్

ఎస్ఎస్ ట్యాంకు వద్ద గట్టు బలహీనం

గుంతకల్లు, ఆగస్టు 20: హంద్రీనీవా కాలువకు గుంతకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద పైపింగ్ ఏర్పడింది. కాలువకు పెద్ద మోతాదులో నీటిని వదిలారు. దీనికి తోడు సోమవారం రాత్రి వర్షం కురవడంతో హంద్రీనీవా కాలువ ఉధృతి పెరిగింది. ఈ కారణంగా జి.కొట్టాల సమీపంలోని కొత్త ఎస్ఎస్ ట్యాంకు సమీపంలో.. ఆలూరు తూము పక్కన మట్టికట్టకు రంధ్రం ఏర్పడింది. సకాలంలో పైపింగ్‌ను పూర్చకపోతే కాలువకు గండిపడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

బలహీనపడ్డ మట్టికట్టలు

హంద్రీనీవా కాలువకు కసాపురం, జ.కొట్టాల, రాగులపాడు, పీసీ ప్యాపిలి గ్రామాల వద్ద గ్రౌండ్ లెవెల్‌లో నీరు పారేలా మట్టికట్టలను నేలకు సమాంతరంగా నిర్మించారు. ఆ తరువాత ఏళ్ల తరబడి నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ముళ్ల పొదలు పెరిగి గుట్టు బలహీనపడ్డాయి. హంద్రీనీవా తొలిదశ విస్తరణ పనులు మధ్యలో ఆగిన కారణంగా నిర్వహణ పనులు చేపట్టడంలేదు. దీంతో కాలువలోనూ ముళ్ల పొదలు పెరిగి.. పూడిక చేరింది. ఇప్పటికే కర్నూలు జిల్లాలో కాలువ గట్టు తెగి ఒకసారి గండి ఏర్పడింది. నీటి పారుదలకు ప్రారంభంలోనే రెండురోజులపాటు అంతరాయం ఏర్పడింది. జలవనరుల శాఖ అధికారులు బలహీనపడ్డ మట్టికట్టలను పటిష్టపరచాల్సిన అవసరం ఉంది.

ఇన్‌లెట్ల వల్ల ప్రమాదం



జీఎస్‌బీసీలో కొట్టుకుపోయిన మట్టికట్ట

గడచిన ఐదు రోజులుగా రాత్రిపూట కురిసిన భారీ వర్షాల కారణంగా హంద్రీనీవాలో ఇన్‌లెట్ల ద్వారా వరద ఉధృతి పెరిగింది. ప్రస్తుతం 1,350 క్యూసెక్కుల నీరు పారుతోంది. ఈ పరిస్థితుల్లో కుండపోత వర్షాల కారణంగా కాలువకు ప్రమాదం ఏర్పడుతోంది. జి.కొట్టాల వద్దకాలువలో నీరు గట్ల పైదాకా వచ్చింది. ఇంత ఒత్తిడిలో కాలువకు గండి ఏర్పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందారు. గుత్తి సబ్ బ్రాంచ్ కాలువలో మట్టితో నిర్మించిన అడ్డుకట్ట కొట్టుకుపోయింది. దీంతో నీరు ఎస్ఎస్ ట్యాంకు పంప్ హౌస్ వైపు కాకుండా, ఎగువ తట్టున ఉన్న ఆలూరు బ్రాంచ్ కాలవ వైపు పారుతోంది. ఈ కారణంగా ఎస్ఎస్ ట్యాంకు పంప్ హౌస్‌కు అంతరాయం ఏర్పడింది. సమస్యను పరిష్కరించడానికి ఎంఈ, డీఈలను సంఘటనా స్థలానికి పంపించామని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య తెలిపారు. పైపింగ్ ప్రదేశాన్ని ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు.

వాగులు పొంగేరా వానలు

నీట మునిగిన పంట పొలాలు

196 హెక్టార్లల్లో రూ.1.73 కోట్ల నష్టం

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా గార్లదిన్నె మండలంలో 126.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. బ్రహ్మసముద్రం మండలంలో 71.4 మి.మీ., యల్లనూరు 70.8, పామిడి 65.4, బుక్కరాయసముద్రం, రాప్తాడు 57.8, గుత్తి 55.6, పుట్లూరు 54.8, రాయదుర్గం 54.2, పెద్దవడుగూరు 52.4, తాడిపత్రి 50.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 47.2, విడపనకల్లు 43.6, గుంతకల్లు 42.2, యాడికి 42.0, డి. హిరేహాళ్, కుందుర్పి 40.6, శెట్టూరు 40.4, అనంతపురం నగరం 38.4, కళ్యాణదుర్గం 37.4, పెద్దపప్పూరు 37.2, శింగనమల 35.6, కణేకల్లు 34.0, కూడేరు 31.2, బెళుగుప్ప మండలంలో 30.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 29.4 మి.మీ.లోపు నమోదైంది. భారీ వర్షం పడిన ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బెళుగుప్ప సమీపంలోని బ్రిడ్జిపై వర్షపు నీరు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 196 హెక్టార్లల్లో రూ.1.73 కోట్ల విలువైన పంటనష్టం జరిగింది. ఇందులో బీర, అరటి, ఎండు మిరప, టమోటా, కళింగర, బీన్స్ ఉల్లిగడ్డ, బొప్పాయి, సాంబార్ దోస, వంకాయ తదితర పంటలు ఉన్నాయి. గార్లదిన్నె, రాప్తాడు, పెద్దవడుగూరు మండలాల్లో కంది, మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటనష్టం జరిగింది.



రాప్తాడు మండలం అయ్యవారిపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పండమేరు

భద్రతకు భరోసా దిశగా..

కోల్‌కతా మహిళా డాక్టర్ హత్యాచార ఘటనతో కదలిక

బోధనాస్పత్రిలో మహిళా డాక్టర్ల భద్రతకు చర్యలు

ఆవరణలో వీధిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు

విశ్రాంతి గదుల్లో వసతుల కల్పనకు నిర్ణయం



డాక్టర్ల భద్రతా చర్యలపై చర్చిస్తున్న అధికారులు

అనంతపురం టౌన్, ఆగస్టు 20: వైద్యుల ఆందోళనకు ఉపశమన దిశగా జిల్లా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఈక్రమంలో వారి భద్రతకు కల్పించాల్సిన చర్యలపై చర్చలు సాగుతున్నాయి. కోల్‌కతా బోధనాసుపత్రిలో పీజీ మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం పట్ల దేశవ్యాప్తంగా జూడాలు ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. సంఘీభావంగా జిల్లాలో కూడా జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి నిరసనలు చేపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆస్పత్రిలో మహిళా డాక్టర్లకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడానికి వైద్యాధికారులు అడుగులు వేస్తున్నారు. తన చాంబర్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు పద్మజ, హేమలత, ఇంజనీర్ నాయుడు, టెక్నీషియన్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి భద్రతా చర్యలపై సమీక్షించారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న బయలు స్థలాల్లో విద్యుత్ లైట్లు లేవని, అక్కడ ప్రత్యేకంగా విద్యుత్ లైట్లు వేయించాలని సూచించారు. మొత్తం మీద 20లైట్లు వేయాల్సి ఉందని ఆదేశించారు. ఆస్పత్రిలో 150 సీసీ కెమెరాలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 110 సీసీ కెమెరాలు మాత్రమే ఉన్నాయని మిగిలినవాటిని త్వరగా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. డ్యూటీ డాక్టర్ల విశ్రాంతి గదులలో వారికి అవసరమైన వసతులు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సమీక్షలో తీర్మానించారు.



అనంతలో ఆందోళన కొనసాగిస్తున్న జూనియర్ డాక్టర్లు

● **మహిళా డాక్టర్లకు బాడీ కెమెరాలు ?**

రెండురోజుల కిందట భద్రతా చర్యలపై కలెక్టరు సమీక్షించినపుడు రాత్రి పూట డ్యూటీ చేసే మహిళా డాక్టర్లకు బాడీ కెమెరాలు ఇస్తే ఎలా ఉంటుందని చర్చించినట్లు సమాచారం. ఆస్పత్రి తరపున కొనుగోలు చేసి రాత్రి డ్యూటీలో ఉండే మహిళా డాక్టర్లకు మాత్రమే అందించాలని నిర్ణయించినట్లు సమాచారం. బాడీ కెమెరాల ద్వారా ఎవరు, ఏమిటి అనేది కూడా సులభంగా తెలుసుకోవడానికి వీలు పడటంతో పాటు ఎలాంటి దాడులు, వేధింపులు జరగకుండా అరికట్టవచ్చన్న ఆలోచన చేస్తున్నారు. ఇందుకు మహిళా డాక్టర్లు ఆమోదం తెలిపితేనే వాటిని కొనుగోలు చేయాలని అధికారులు చూస్తున్నారు.

● **మత్తుపైనా ప్రత్యేక నిఘా**

వైద్య కళాశాలలో మత్తు పదార్థాల వ్యవహారాలు కొనసాగకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల వెలుగు చూస్తున్న మత్తు పదార్థాల ఘటనల్లో విద్యార్థులు, మెడికోలు ఉంటున్నట్లు తెలుస్తోంది. అనంత వైద్య కళాశాలలోను ఇలాంటి వ్యవహారాలు గుట్టుగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆర్ఎంఓలు, ఇతర వైద్యాధికారులు వీటిపై లోతుగా విచారణ చేశారు. ఓ ప్రైవేట్ వ్యక్తి రాత్రి సమయాలలో వచ్చి కొందరు మెడికోలకు మత్తు పదార్థాలు అందజేస్తున్నట్లు గుర్తించారు. ఐదారుగురు మెడికోలు మత్తుకు బానిసలైనట్లుగా నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈవిషయంపై జిల్లా ఎస్పీకి సైతం సమాచారం ఇచ్చినట్లు ఆస్పతి వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈనేపథ్యంలో వైద్య కళాశాలకు మత్తు పదార్థాలు సరఫరా కాకుండా గట్టి నిఘా పెట్టినట్లు సమాచారం.

వారంలోపు భద్రతా చర్యలు

ఆస్పత్రిలో రాత్రి డ్యూటీకి వచ్చే మహిళా డాక్టర్లకు అవసరమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నాం. కలెక్టరు ఆదేశాల మేరకు ఆర్ఎంఓలు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాం. అన్నిప్రాంతాలలోను వెలుతురు ఉండేలా వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నాం, అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం, మహిళాడాక్టర్లకు బాడీ కెమెరాలు ఇవ్వాలని ఆలోచిస్తున్నాం. అయితే వీటికి మహిళా డాక్టర్లు ఆమోదం తెలపాల్సి ఉంది. మత్తు పదార్థాలు సరఫరా కాకుండా ప్రత్యేక నిఘపెట్టాలని జిల్లా ఎస్పీకి విన్నవించిన విషయం వాస్తవమే.

\- డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్

25న వ్యవసాయ శాఖ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం నగరంలోని రైతు బజార్ వద్ద ఉన్న కృషి భవన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కోశాధికారి శ్యాంసుందర్ శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారిగా కృష్ణా జిల్లా అధ్యక్షుడు రమేష్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నుంచి క్లాస్‌ఫోర్ ఉద్యోగుల దాకా ప్రతిఒక్కరూ హాజరై ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు జలకళ



బెళుగుప్ప, ఆగస్టు 20: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. ఈ నెల 9వ తేదీన హంద్రీనీవా పథకం కింద రిజర్వాయర్‌కు రాగులపాడు ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా జలాలను వదిలారు. రోజురోజుకూ ఇన్‌ఫ్లో అధికంగా ఉండటంతో నీటిమట్టం పెరుగుతోంది. 1.68 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న రిజర్వాయరులో ప్రస్తుతం 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మంగళవారం 1060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు.

సవరించాకే సర్దుబాటు చేయాలి

డీఈఓకు సంఘాల నేతల వినతి

అనంతపురం విద్య, ఆగస్టు 20: పని సర్దుబాటుపై ఉపాధ్యాయుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాతే సర్దుబాటును కొనసాగించాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో డీఈఓ వరలక్ష్మిని ఫ్యాప్టో నేతలు మంగళవారం కలిశారు. వారు మాట్లాడుతూ.... ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు పలు అంశాలపై విద్యాశాఖ రాష్ట్ర అధికారులకు సమస్యలపై సూచనలు చేశారన్నారు. నాయకుల అభిప్రాయాల మేరకు పునఃఉత్తర్వుల(రివైజ్డ్ గైడ్‌లైన్స్) జారీ చేశారని, అయితే జిల్లాల్లో అధికారులు అవి ఏమాత్రం పాటించడం లేదన్నారు. దీని వల్ల వందలాది మంది టీచర్లు చాలా నష్టపోతారని నాయకులు డీఈఓకు వివరించారు. గుత్తి, కుందుర్పి, బెళుగుప్ప ఎంఈఓలు సరిగా సర్దుబాటు చేయలేదని ఫిర్యాదుచేశారు. అధికారులకు ఇచ్చి అన్ని అభ్యంతరాలు సవరించిన తర్వాతే సర్దుబాటు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ఇతర నేతలు గోవిందరాజులు, రమణారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేష్, సూర్యుడు, నాగేంద్ర, రామాంజినేయులు, రత్నం, రవీంద్ర, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు నాయక్, వెంకటరమణ,సర్దార్‌వలి, వన్నప్ప, సుహేల్, శ్రీరాములు పాల్గొన్నారు.

24న ఉద్యోగ మేళా

కొత్తచెరువు, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లాలోని అనంతపురంలో ఈనెల 24న ఉద్యోగ మేళా నిర్వహిస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళా నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ వారు డిజిటల్ సపోర్టు ఉద్యోగాల కోసం 2023-24లో ఇంటర్ పాసైన విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.1.07 లక్షలు జీతం చెల్లిస్తారన్నారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు రాజీవ్ ఘనతే



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

\- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

మడకశిరటౌన్, ఆగస్టు 20: దేశ పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. పట్టణంలో రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ సర్కిల్లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక రంగాలతో పాటు వ్యవసాయ, ఇతరత్రా రంగాలలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చి, దేశాభివృద్ధికి రాజీవ్‌గాంధీ చేసిన కృషి మరువలేనిదన్నారు. గ్రామాల అభివృద్ధికి రాజ్యాంగాన్ని సైతం సవరించి గ్రామ పంచాయతీలకు కేంద్రం నుండి నేరుగా నిధులు వచ్చే విధంగా చేశారన్నారు. ఆయన తీసుకొన్న నిర్ణయం వల్లే గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ మంజునాథ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

2.8కిలోల మత్తు పదార్థం స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శేఖర్

గోరంట్ల, ఆగస్టు 20: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 2.8కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. గోరంట్లలోని రాజీవ్‌కాలనీకి చెందిన షేక్‌అఫ్రోజ్, జామియామసీదు ప్రాంతంలో ఉంటున్న షేక్ మహమ్మద్, మహమ్మద్‌రిజ్వాన్, మహమ్మద్‌ఇమ్రాన్‌లు గంజాయికి అలవాటు పడ్డారు. ఈక్రమంలో వారు తెచ్చుకోవడంతో పాటు ఇతరులకు విక్రయించేవారు. ఈక్రమంలో దీన్నే వృత్తిగా చేసుకుని మరికొందరితో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. అందిన సమాచారం మేరకు గోరంట్ల సీఐ శేఖర్ తన సిబ్బందితో గుమ్మయ్యగారిపల్లి కూడలిలో దాడిచేసి పైనలుగురిని పట్టుకోగా మిగిలిన వారు పారిపోయారన్నారు. వీరంతా 30ఏళ్ల లోపు యువకులని, ముగ్గురు మెకానిక్‌లుకాగా, ఒకరు వెల్డింగ్ పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీరు కదిరి ప్రాంతంనుంచి గంజాయిని తెస్తున్నారని, చిత్తూరు జిల్లా వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నారని, వారందరిని వారం పదిరోజుల్లో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్, పోలీసులు వెంకటేష్, వసంత్, రామానాయక్, రెడ్డిబాషా తదితరులున్నారు.

బ్యాంకర్లు చిత్తశుద్ధితో పేదలకు సేవలందించాలి

● జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

● అర్హులందరికీ రుణాలు అందజేయాలి: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: బ్యాంకర్లు చిత్తశుద్ధితో పేదలకు సేవలందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఆవరణలో ఉన్న డీపీఆర్సీ భవనంలో మంగళవారం జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన రుణం సకాలంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు బ్యాంకర్లు నిర్లక్ష్యం వీడాలని సూచించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. బ్యాంకర్లు బాధ్యతగా పని చేసి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లు ప్రభుత్వ పథకాలపై కనీస అవగాహన లేకుండా సమావేశాలకు రావడం అలసత్వానికి నిదర్శనమని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో రైతులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు విరివిగా రుణాలు అందజేయాలన్నారు. బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయలోపంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గం కేంద్రంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నాబార్డు అధికారులు ఉన్నారా లేదా అనే అనుమానం వస్తోందని, పథకాలను అర్హులకు అందజేయడంలో సరిగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అందించిన సహకారం, సమగ్ర నివేదికతో జిల్లా సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించామని, భవిష్యత్తులో మరింత నిధులు తీసుకురావడానికి కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సమావేశంలో ఎల్‌డీఎం నర్సింగరావు, లీడ్ జిల్లా అధికారి గిరిధర్, జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ పీడీ ఓబుళమ్మ, పశుసంవర్ధకశాఖ జేడీ సుబ్రహ్మణ్యం, డీఈఓ వరలక్ష్మి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, హ్యాండ్‌లూమ్ ఏడీ అప్పాజీరావు, డీసీసీ జీఎం నాగరాజురావు, నాబార్డు డీడీఎం అనురాధా, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, ఫిషరీస్ డీడీ శ్రీనివాసనాయక్, వివిధ బ్యాంకుల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాకట్టులో సర్టిఫికెట్లు

✦ గత ఐదేళ్లలో ప్రైవేట్ కళాశాలల నిర్వాకం

✦ నేటికీ కొనసాగుతున్న కనికట్టు

✦ అమలుకాని మంత్రి లోకేశ్ ఆదేశాలు

✦ మొత్తం ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్ల విడుదల

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 20: ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నత విద్యాప్రవేశాలు పొందిన విద్యార్థులు వారి మునుపటి విద్యకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలల యాజమాన్యాలు తాకట్టు పెట్టుకుంటున్నాయి. ఏదైనా అవసరాలకోసం వాటిని ఇవ్వాలని బతిమాలినా ఫీజు మొత్తాన్ని చెల్లించి తీసుకెళ్లాలని తెగేసి చెబుతున్నాయి. ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకోవద్దన్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాలను యాజమాన్యాలు పెడచెవిన పెడుతున్నాయి. సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకోవడం చట్టబద్ధం చేసినట్లుగా గత వైసీపీ పాలనలో కళాశాలల యాజమాన్యాలు వ్యవహరించాయి.

ప్రచార పిచ్చికి తాకట్టు

2014-19లో టీడీపీ ప్రభుత్వం విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను కళాశాలల ఖాతాలకే జమజేసింది. ఫీజులకు సర్టిఫికెట్లకు ఎలాంటి లింకు పెట్టలేదు. అయితే వైసీపీ పాలనలో సీన్ రివర్స్ అయింది. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి సొంత ప్రచారం చేసుకునేందుకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను తానే ఇస్తున్నట్లు విద్యాదీవెన, వసతి దీవెనల పథకాలుగా పేర్లు మార్చారు. కళాశాలలకు చెల్లించాల్సిన మొత్తాలను విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు జమచేస్తూ వచ్చారు. ఈ అంశంపై కళాశాలల యాజమాన్యాలు పలుమార్లు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశాయి. ఒకేసారి చెల్లించాల్సిన ఫీజులను సంవత్సరంలో నాలుగుసార్లు ఇవ్వడంతో విద్యార్థులు కట్టలేకపోతున్నారని, ఇలాగైతే కళాశాలలు నడపలేమని తేల్చిచెప్పాయి. ఈ నేపథ్యంలో ప్రవేశాల పొందే సమయంలోనే ఫీజుల గ్యారెంటీగా తమ పిల్లల ఒరిజనల్ సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకోవడం రివాజు మారిపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

లక్షలాది మంది సర్టిఫికెట్లు

జేఎన్‌టీయూ పరిధిలో 69 బీటెక్, 39 బీఫార్మసీ, ఎస్కేయూ అనుబంధంగా 60 డిగ్రీ, 9 పీజీ, ఆరు పాలిటెక్నిక్ మొత్తం 183 ప్రైవేట్ కళాశాలలున్నాయి. వీటిలో దాదాపు 2లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వీరందరి సర్టిఫికెట్లు ఆయా కళాశాలల యాజమాన్యాలు తాకట్టు పెట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులే సొంతంగా కళాశాలలకు ఫీజులు చెల్లించి వారి పిల్లల సర్టిఫికెట్లును విడిపించుకుంటున్నారు. సంబంధిత కోర్సులు పాసైనా ఆర్థిక స్తోమతలేక ఫీజులు కట్టలేదని, దీంతో నేటికి తమ సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉండిపోయాయని పలువురు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

భద్రతకు భరోసా లేదు

పాలిటెక్నిక్ ప్రవేశాలకు పదో తరగతి మార్కుల జాబితా, బీటెక్, డిగ్రీ, బీఫార్మసీ అడ్మిషన్స్‌కు పదితోపాటు ఇంటర్, పీజీ ప్రవేశాలకు పది, ఇంటర్, డిగ్రీ ఒరిజనల్ మార్కుల జాబితాలను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తాకట్టు పెట్టుకుంటున్నాయి. మీ ఫీజులు చెల్లించేంత వరకు సర్టిఫికెట్లు మావద్ద ఉంటాయని చెబుతున్నాయి. ఏ సెమిస్టర్‌కు ముందు ఆ సెమిస్టర్ ఫీజు కట్టాలి. లేకుంటే హాల్‌టికెట్లు కూడా ఇవ్వరు. విద్యాభ్యాసం చివరి సంవత్సరంలో సంబంధిత కోర్సు మార్కుల జాబితాలను తీసుకెళ్లేముందు మొత్తం ఫీజులు చెల్లించాలి. కోర్సు కాలంలోపు మీకేదైనా జరిగినా. కళాశాలకు రాకున్నా, ఇతర కారణాలేవైనా మా ఫీజులు ఎవరు కడతారు?. అందుకే మీ ఒరిజనల్ సర్టిఫికెట్లను తాకట్టు పెట్టుకుంటున్నామని యాజమాన్యాలు చెబుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. విద్యాభ్యాసం పూర్తి అయ్యేవరకు తమ సర్టిఫికెట్లకు భరోసాలేదని, అనేక మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పోగొట్టారని మండిపడుతున్నారు. ఈ సమస్యను టీడీపీ దృష్టికి తీసుకెళ్లడంతో సర్టిఫికెట్లకు లింక్‌లేకుండా నేరుగా కళాశాలలకే ఫీజులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

సర్టిఫికెట్లు తీసుకోవడం నేరం



యూజీసీ మార్గదర్శకాల మేరకు ఒరిజనల్ సర్టిఫికెట్లను కళాశాలల్లో పెట్టుకోవడం నేరం. 2020-23 విద్యాసంవత్సరాల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఒరిజనల్ సర్టిఫికెట్లును కళాశాలలు తీసుకున్నట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీంతో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఎటువంటి ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకోవద్దని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కళాశాలల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించి హెచ్చరికలు జారీచేశాం. తాకట్టుపెట్టుకున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో హెల్ప్‌డెస్క్ ద్వారా విద్యార్థులు ఫిర్యాదు చేయవచ్చు.

\- ప్రొఫెసర్ సుదర్శన రావు, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ

క్రిమినల్ కేసులు పెట్టిస్తాం



విద్యార్థుల ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకున్న కళాశాలలపై క్రిమినల్ కేసులు పెట్టిస్తాం. గడిచిన సంవత్సరాల్లో ఇలాంటి వాటికి పాల్పడిన కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించాం. ఈ విద్యాసంవత్సరంలో ఎవరైనా ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకుంటే వర్సిటీ అనుబంధ గుర్తింపును రద్దుచేస్తాం. అడ్మిషన్స్ రూల్స్‌ను పాటించి అందుకు అవసరమైన సర్టిఫికెట్లను మాత్రమే తీసుకోవాలి.

\- ప్రొఫెసర్ అనిత, ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఏపీ సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావులతో కలిసి మంగళవారం ఆయన రాయలసీమ జిల్లాల వ్యవసాయ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాకు ఉలవలు, అలసంద, పెసర, జొన్న, కొర్ర విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన రైతులకు విత్తనాలు పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీసీలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, శాస్త్రవేత్తలు జాన్సన్, విజయశంకర్‌బాబు, మల్లేశ్వరి, నారాయణస్వామి, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

పోట్లాట!

● కడప సెక్రటరీ వర్సెస్ అనంత ప్రెసిడెంట్

● ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్

● అసౌకర్యాలతో క్రీడాకారుల అవస్థలు

● జాతీయ ఫుట్‌బాల్ పోటీల వేదికగా విభేదాలు బహిర్గతం



జాతీయ ఫుట్‌బాల్ బాలికల మ్యాచ్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్ నడుస్తోంది. నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీల వేదికగా విభేదాలు బహిర్గతమయ్యాయ. పోటీలకు జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి విద్యాశ్రీధర్ హాజరవుతారని చెప్పారు. నిర్వాహకులైన ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, కడప జిల్లా సెక్రటరీ డేని యల్ ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మధ్య విభేదాలు, సమన్వయ లోపంతో ఆయనకు ఆహ్వానం పంపలేదని సమాచారం. ఈక్రమంలోనే ప్రారంభ వేడుకల్లో సైతం ఎవరికి వారుగా వేర్వేరుగా ఇద్దరూ ఉండి పోయారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా అలా వచ్చి ఇలా వెళ్లి పోయారు. అంతా ఫొటోలకు ఫోజులిచ్చేవరకు ఉన్నారు. ముఖ్య అతిథులు వెళ్లిపోగానే గ్రౌండ్ మొత్తం ఖాళీ అయిపోయింది. ఇక అప్పటి నుంచి క్రీడాకారులకు సరైన భోజనం, వసతి అందడం లేదు. సమస్య ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక క్రీడాకారులు మిన్నకుండిపోయారు. ప్రధాన నిర్వాహకులు డేనియల్ ప్రదీప్, వేణుగోపాల్‌లు మైదానంలో కనబడరు. ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ క్రీడాకారులను సమస్యల్లోకి నెట్టేశారు. సరైన షెడ్యూల్, ప్రోగ్రామింగ్ లేక పోటీల నిర్వహణ సైతం ఆలస్యంగా జరుగుతోంది. సెమీస్ పోటీల్లో ఎవరితో ఎవరు పోటీ పడాలో అర్థం కాని పరిస్థితుల్లో జట్ల మధ్య విబేదాలు సృష్టించారు. ఇక సెమీస్ పోటీలు జరిగిన ఆదివారం క్రీడాకారులకు సరైన భోజనం లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పోటీలకు సంబంధించి విరాళాలు కూడా ఎవరికివారు వేర్వేరుగా వసూలు చేసినట్లు సమాచారం. దీనిపై జాతీయ ఫెడరేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ పోటీల వేదికగా తమకు కలుగుతున్న అసౌకర్యాలపై పలురాష్ట్రాల క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ తీరు సక్రమంగా లేదని ఏపీ, జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కడప, అనంతపురం అధ్యక్ష, కార్యదర్శులు మధ్య తలెత్తిన మనస్పర్థలు, ఆధిపత్య పోరుతో ఇలా చేయడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. ఆయారాష్ట్రాల క్రీడాకారులు, మేనేజర్లు ఇక్కడ జరుగుతున్న వాస్తవాలను జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు సమాచారం.

జాతీయ ఫుట్‌బాల్ విజేత మణిపూర్



ట్రోఫీతో విజేత మణిపూర్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ విజేతగా మణిపూర్ జట్టు నిలిచింది. 20 రోజులుగా స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీలో నిర్వహిస్తున్న జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్ పోరులో జార్ఖండ్, మణిపూర్ జట్లు తలపడ్డాయి. ఉత్కంఠగా సాగిన పోరులో జార్ఖండ్‌పై 2 గోల్స్ తేడాతో మణిపూర్ విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. పెద్ద రాష్ట్రాలు పోటీలో లేకపోవడం గమనార్హం. ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ చేతుల మీదుగా విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ముని శ్రీనివాస్, వేణుగోపాల్, కార్యదర్శి డేనియల్ ప్రదీప్, జిల్లా కార్యదర్శి మల్లేష్, కడప అధ్యక్షుడు సుధీర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో రూరల్ అథ్లెటిక్స్

రామగిరి, ఆగస్టు 20: ఆర్డీటీ ఆధ్వర్యంలో మండలంలోని నసనకోట మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన విద్యార్థినులకు మంగళవారం రూరల్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అమీనాబేగం, ఆర్డీటీ ఏటీఎల్ పద్మావతి చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అండర్-14 లాంగ్ జంప్‌లో నసనకోట ఎంజేపీ పాఠశాల భువనకృతి, షాట్‌పుట్‌లో ఎంజేపీ నసనకోట చరితశ్రీ, అండర్-16 విభాగంలో అమృత, కనగానపల్లి మోడల్ స్కూల్ షాట్‌పుట్ అండర్-16లో రామేశ్వరమ్మ, కనగానపల్లి కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 60 మీటర్ల పరుగుపందెంలో మొదటి బహుమతి బ్రాహ్మణి, జడ్పీహెచ్ఎస్ తరగకుంట పాఠశాల విద్యార్థిని వంశిక 100 మీటర్ల పరుగుపందెంలో మొదటి బహుమతి, అండర్-200 మీటర్లలో ఎంజేపీ నసనకోట విద్యార్థి సుకన్య మొదటిస్థానం పొందారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచించారు.

ఆత్మీయ కలయిక

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: వ్యవసాయ శాఖ విశ్రాంత వ్యవసాయ అధికారులు మంగళవారం స్థానిక రైతు బజార్ వద్ద ఉన్న కృషి భవన్‌లో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత ఏడీఏ రమణ 92వ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యవసాయ ఉ ద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి మల్లికార్జున, విశ్రాంత జేడీఏలు ఠాగూర్ నాయ క్, నాగన్న, సుబ్బారెడ్డి, నాగలక్ష్మయ్య, వి శ్వనాథ్, చంద్రాయుడు పాల్గొన్నారు.

పొంగిపొర్లిన వాగులు, వంకలు..

జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వంకలు పొంగిపొర్లాయి. బుక్కరాయసముద్రం చెరువులోకి నేరు చేతున్నాయి. పండమేరు వంక పరవళ్లు తొక్కుతోంది. కొడిమి జర్నలిస్టు కాలనీ సమీపంలో చెక్‌డ్యాం నిండి పారుతున్నాయి. బుక్కరాయసముద్రంలో వర్షంధాటికి పలు పంటలు దెబ్బతిన్నాయి.

గాలివాన బీభత్సం


వర్షపునీటితో నిండిన జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానం

గార్లదిన్నె: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చెట్లు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టులను కొందరు స్వార్థప్రయోజనాల కోసం పూడ్చివేశారు. ఫలితంగా వర్షం నీరు మడుగులా చేరడంతో ప్రమాదకరంగా మారింది. జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానం నీటి కుంటను తలపించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అదేనీటిలోనే క్లాసులకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిండిన చెక్‌డ్యాంలు


ఉధృతంగా ప్రవహిస్తున్న రాచానపల్లి వంక

అనంతపురంరూరల్: మండలంలోని వంకలు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున వరకు భారీ వర్షం కురిసింది. రాచానపల్లి చెక్‌డ్యాం నిండింది. కొడిమి వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలు స్తంభించాయి.

నీటమునిగిన పంటలు


రోటరీపురంలో నేలకొరిగిన బీరపంట

బుక్కరాయసముద్రం: మండలంలో సోమవారం రాత్రి వీచిన గాలి, వాన ధాటికి ఉద్యాన పంటలు, వేరుశనగ, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రోటరీపురం గ్రామంలో రైతు ప్రకాష్‌కు చెందిన బీర పంట పూర్తిగా దెబ్బతినింది. అలాగే చిక్కవడయార్ చెరువుపై భాగంలో కురిసిన వర్షాలకు నీరు చేరుతోంది.

పండమేరు పరవళ్లు


రాప్తాడు: భారీ వర్షానికి పండమేరు వంక పరవళ్లు తొక్కుతోంది. సోమవారం రాత్రి మండలంతో పాటు కనగానపల్లి, రామగిరి మండలాల్లో భారీ వర్షం కురవడంతో పండమేరు వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్నానదికి జలకళ

శింగనమల: మండలంతో పాటు చుక్కపక్కల ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానది పరవళ్లు తొక్కుతోంది. కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, ఉల్లికల్లు గ్రామాల్లో పై భాగంలో నది ఉంది. మూడు సంవత్సరాలుగా పెన్నాలో నీటి ప్రవాహం లేదు.


తరిమెల వద్ద పెన్నానదిలో ప్రవహిస్తున్న నీరు

మడుగును తలపించిన పాఠశాల


గోల్డెన్ బెల్స్ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని గోల్డెన్ బెల్స్ ప్రైవేటు పాఠశాల ఆవరణం వర్షం నీటితో నిండిపోయింది. పాఠశాల చెరువుకు దగ్గరగా ఉండటంతో ఈ సమస్య ఏర్పడింది. 15 ఏళ్లుగా తెగిపోయిన చెరువుకు మరమ్మతులు చేపట్టలేదు.

నరహంతకులను కఠినంగా శిక్షించాలి

● జూనియర్ డాక్టర్ల డిమాండ్


ఆస్పత్రిఆవరణలో రిలేదీక్ష కొనసాగిస్తున్న జూడాలు

అనంతపురం టౌన్, ఆగస్టు 20: కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం చేసిన నరహంతకులను కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. ఘటనపై జిల్లాకేంద్రంలో జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగించారు. జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో మంగళవారం వందలాదిమంది పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. మహిళాడాక్టర్‌ను హత్యచేసిన నరహంతకులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని, డ్యూటీలో ఉంటున్న డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. సాయంత్రం 5గంటల వరకు దీక్షలు కొనసాగించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ వేర్వేరుగా జూడాలు కలిసి తమ డిమాండ్లు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసికెళ్లాలని కోరుతూ వినతులు అందజేశారు. జూడాల ఆందోళనలకు మేయర్ మేయర్ వసీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పరదేశీనాయుడు, పలువురు సీనియర్ డాక్టర్లు పాల్గొని సంఘీభావం తెలిపారు. జూడాలు రాఘవేంద్ర, హరినాథ్‌రెడ్డి, సమరసింహారెడ్డి, ప్రణయ్‌రెడ్డి, సింధూచౌదరి, వర్షిత పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: మండలంలోని చియ్యేడు పాఠశాలలో నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యురాలి హత్యాచారానికి నిరసన చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర, ఇతర టీచర్లు, విద్యార్థులు కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు విజయ్, ఉమామహేశ్వర్, నివేదిత, నాగమణి, భారతి, పుల్లయ్య, భాస్కర్ రెడ్డి, నళినాక్షి, శిరీష, ప్రసాద్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గౌతమి డిమాండ్ చేశారు. మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. వైద్యులు దేవుళ్లతో సమానమన్నారు. అలాంటి వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. వైద్యాధికారులు గౌతమి, మంజుల, అనీష, దిలీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


చియ్యేడులో కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆత్మకూరు, ఆగస్టు 20: మండలంలోని పంపనూరు సుబ్రమ్మణ్యేశ్వర ఆలయంలో శ్రావణమాస మూడవ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, విశేష కుంకుమార్చన, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి అలంకరించే బంగారు కవచాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులు ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామివారికి అందించారు. ప్రధాన అర్చకులు రాముస్వామి స్వామివారికి పూజలు చేశారు. భక్తులుకు అన్నదానం చేశారు.

వర్షపునీటిని తొలగించాలని ధర్నా


బురద నీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 20: మండల కేంద్రంలోని ఆర్డీటీ గ్రౌండు ముందు ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని తొలగించాలని సీపీఐ మండల నాయకులు మంగళవారం వినూత్న రీతిలో ధర్నా చేశారు. ఎన్నోఏళ్లుగా రోడ్డుపై మురుగు నీరు తొలగించాలని గ్రామ పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని విమర్శించారు. సమస్య పరిష్కరించేంత వరకు వర్షపు నీటిలో నిలబడి భీష్మించారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీనిపై స్పందించిన ఎన్‌హెచ్ఏఐ ఏఈ కుళ్లాయిరెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనాయక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రామక్రిష్ణ, శివ, రామంజనేయులు, గోపాల్ నాయక్, నాగరాజు, తులసీ నాయక్, హనుమన్న, అశోక్ పాల్గొన్నారు.

దబోల్కర్ ఆశయాలను కొనసాగిద్దాం


దబోల్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేవీవీ నాయకులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 20: మూఢ నమ్మకాల నిర్మూలనకు ఎనలేని కృషిచేసిన మహారాష్ట్రకు చెందిన నరేంద్ర దబోల్కర్ ఆశయాలను కొనసాగిద్దామని జేవీవీ నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన పిలుపునిచ్చారు. దబోల్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం జేవీవీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసూన మాట్లాడుతూ మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని కొందరు స్వామీజీలుగా అవతారమెత్తి ప్రజల మానప్రాణాలతో చెలగాటమాడిన అనేక సందర్భాలు వెలుగుచూసిన విషయం మనందరికీ తెలిసిందేనన్నారు. అలాంటి వాటికి వ్యతిరేకంగా నరేంద్ర దబోల్కర్ కృషి చేశారని, వాటి నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని పోరాటం చేశారని గుర్తు చేశారు. దీనిని సహించలేని కొందరు భావజాల వ్యతిరేకులు ఆయనను హత్య చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వీరరాజు, గాంగేనాయక్, లక్ష్మీనారాయణ, బాబ్జాన్, అనీల్ పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదేశం


శ్మశాన వాటికను సందర్శిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 20: నగరంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి సత్వర చర్యలు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ముతవల్లిల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్‌షఫీతోపాటు, మేయర్ వసీం శ్మశానవాటిక స్థలాన్ని సందర్శించారు. శ్మశానవాటిక పరిస్థితిపై ముస్లింలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రహరీ నిర్మాణంతోపాటు లైట్స్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఎమ్మెల్యే ఆదేశించారు. రవి, తాజుద్దీన్, షౌకత్, వహీద్, బాషా, బాబా పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లోనూ చిరంజీవి మెగాస్టారే

● రక్తదాన శిబిరంలో ఎంపీ, ఎమ్మెల్యే


రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, రవికుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 20: సినిమాల్లోనే కాదు... సేవా కార్యక్రమాల్లోనూ చిరంజీవి మెగాస్టారేనని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్ అన్నారు. మంగళవారం పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద చిరంజీవి అభిమాన యూత్ రాష్ట్ర అధ్యక్షుడు భవానీ రవికుమార్ ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు ముందస్తు వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ చిరంజీవి బ్లడ్‌బ్యాంకు ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడారన్నారు. చిన్ననాటి నుంచే స్వయంకృషితో సినిమాల్లో ఎదిగారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ, పార్లమెంటు మీడియా కో-ఆర్డినేటర్ కూచి హరి, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు జయరాంరెడ్డి, నాయకులు భాస్కర్, రమణ, చిన్న, మధు, వెంకటనారాయణ, చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు చలపతి, చంద్రమౌళి, షామీర్, శేషాద్రి, కాయగూరల లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: జిల్లా నూతన ఎస్పీ జగదీష్‌ను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జగదీష్‌ను ఎమ్మెల్యే కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పేరు, తన పేరు చెప్పి ఎవరైనా పోలీసులపై ఎవరైనా ఒత్తిళ్లు తీసుకొస్తే ఉపేక్షించవద్దని, అలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు చెప్పిన విధంగా ప్రజలకు సుపరిపాలన అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయండి


జడ్పీ సీఈఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న జయచంద్రనాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: జిల్లాలో కీలకంగా ఉన్న జడ్పీ, డీఆర్‌డీఏ-వెలుగు ద్వారా పేదరిక నిర్మూలనకు పాటుపడాలని, జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సోమర జయచంద్రనాయుడు కోరారు. జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఉన్న ఓబుళమ్మను ఆయన మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీకి రాజీనామా: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సోమర జయచంద్రనాయుడు వైసీపీకి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఆ పార్టీ పెద్దలకు పంపారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా పనిచేసిన కూడేరు మండలానికి చెందిన జయచంద్రనాయుడు, నగరంలోని శివాలయ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.

బాల్యవివాహాల నియంత్రణపై చైతన్యం అవసరం

అనంతపురం విద్య, ఆగస్టు 20: బాల్యవివాహాల నివారణపై గ్రామస్థాయి నుంచే అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్యవివాహాల నియంత్రణపై మత పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ బాల్యవివాహాలపై ప్రజల్లో, యువతీ, యువకుల్లో అవగాహన పెంచాలన్నారు. పెళ్లిళ్లు చేసే సమయంలో వయస్సు నిర్ధారణ తప్పనిసరిగా చూడాలన్నారు. ఆధార్ కార్డును, జనన ధ్రువీకరణ పత్రాలను లేదా స్కూల్ సర్టిఫికెట్లు పరిశీలించాలన్నారు. డిస్ట్రిక్ట్ మైనార్టీ వెల్ఫేర్ డీడీ రామసుబ్బారెడ్డి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, డీసీపీఓ మంజునాథ్, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా రాఘవేంద్రస్వామి ఆరాధన


విశేష అలంకరణలో రాఘవేంద్రస్వామి

అనంతపురం విద్య, ఆగస్టు 20: శ్రీ మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ప్రథమ ఆరాధన కన్నుల పండువగా సాగింది. నగరంలోని జేఎన్‌టీయూ రోడ్డు నేతాజీ నగర్‌లో రవీంద్రస్వామీజీ గృహంలో శ్రీ గురురాయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి 353 ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రథమ ఆరాధన చేశారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, వెంకటేశ్వరస్వామి, రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అనంతపురం నగరంతోపాటు కూడేరు, కరుట్లపల్లి, చోళసముద్రం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు రవీంద్ర స్వామీజీ మహిమాన్విత శ్రీగంధం, కుంకుమ, పండ్లు అందించారు. అంతకు ముందు స్వామీజీ మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా ఎదగాలంటే నిత్యం కొంత సమయం ధ్యానానికి కేటాయించాలన్నారు. దీని వల్ల మానసిక ప్రశాంతతతోపాటు సంకల్పించిన పనులు నెరవేరుతాయన్నారు. మరీ ముఖ్యంగా మనస్సులోకి ఆత్మస్తుతి, పరచింతన రాకుండా చూడాలని హితోక్తి పలికారు. అనంతరం శ్రీ గురురాయ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్న వితరణ చేశారు.


భక్తులకు ప్రసాదాలు అందిస్తున్న స్వామీజీ

భక్తిశ్రద్ధలతో పూర్వారాధన

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామివారి పూర్వారాధనను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి బృందావనానికి నిర్మాల్య విసర్జన, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాది కైంకర్యాలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నదాన వినియోగం చే శారు. మఠం సిబ్బం ది, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు సత్వరం పరిష్కరించాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఆగస్టు 20: ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక 21వ డివిజన్ 33వ సచివాలయం పరిధిలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ముందుగా సచివాలయాన్ని సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం మున్నానగర్‌లో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణాలు, తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రజలతో ఓపికగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటన్నింటికీ తగిన పరిష్కారం చూపుతామన్నారు. ఇక నుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లి ప్రజా సమస్యలు నేరుగా అడిగి తెలుసుకొని, పరిష్కరిస్తామన్నారు. నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతోపాటు నాయకులు రాయల్ మురళీ, లక్ష్మీనరసింహ, రమేష్, పోతుల లక్ష్మీనరసింహులు, గుర్రం నాగభూషణం, సరోజమ్మ, కృష్ణం రఘు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఆగస్టు 20: నిత్యం అప్రమత్తంగా ఉంటూ అక్రమ మద్యం, మట్కా, గుట్కాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ జగదీష్ స్పెషల్ బ్రాంచి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో స్పెషల్ బ్రాంచి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మట్కా, పేకాట, నిషేధిత గుట్కా పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. జిల్లాలో ఫ్యాక్షన్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సీఐ ధరణికిశోర్, ఎస్పీ హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే మలేరియాకు అడ్డుకట్ట

అనంతపురం టౌన్, ఆగస్టు 20: దోమల నివారణతోనే మలేరియాకు అడ్డుకట్ట వేయవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా జిల్లా కార్యాలయంలో బ్రిటిష్ డాక్టర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆడదోమ వల్ల మలేరియా వ్యాపిస్తుందని మొట్టమొదట కనుగొన్న వ్యక్తి డాక్టర్ రోనాల్డ్‌రాస్ అన్నారు. అనంతరం కురుగుంట పీహెచ్‌సీ రాచానపల్లి గ్రామంలో విద్యార్థులు, వైద్యసిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, అసిస్టెంట్‌డీఎంఓ సత్యానారాయణ, అనంతపురం యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, డెమోలు త్యాగరాజ్, గంగాదర్ పాల్గొన్నారు.

నార్పల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సాదియా, బాలాజీ, సరోజమ్మ, సూపర్‌వైజర్ ప్రమీలమ్మ, హెల్త్‌అసిస్టెంట్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి రైతుకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు


రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ రఘునాథరెడ్డి

శింగనమల, ఆగస్టు 20: అర్హత ఉన్న రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందజేస్తామని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి అన్నారు. మండలంలోని జూలా కాలువ గ్రామంలో మంగళవారం రైతులకు అవగహన సదస్సు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సబ్సిడీ కింద డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఎక్కువ టార్గెట్ కెటాయించారన్నారు. బోరు బావుల కింద రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంఐఏఓ జి.దిలీప్‌కుమార్, ఓబిలేసు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్ర పరికరాలపై శిక్షణ

నార్పల, ఆగస్టు 20: మండలంలోని చామలూరు గ్రామంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగంపై దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్ర శిక్షణ, పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతు రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ నాందేడ్ వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగంపైఅవగాహన కల్పించారు. కనకప్ప, కిరణ్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

పేదల కడుపు మాడ్చొద్దు

అనంతపురంరూరల్, ఆగస్టు 20: మండలంలోని రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని పేదలకు మూడు నెలలుగా రేషన్ సరఫరా చేయడం లేదని, ఇలా చేసి వారి కడుపు మాడ్చొద్దని సీపీఎం ఒకటవ నగర్ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి కోరారు. మంగళవారం అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ శ్రీరాములును కలసి వినతి పత్రం ఇచ్చారు. మూడు నెలలుగా బియ్యం సరఫరాలో లోపాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొందరు డీలర్లు వచ్చిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఉపసర్పంచు మసూ ద్, కాలనీ వాసులు సీనా, మోహన్, వన్నూరమ్మ, దస్తగిరమ్మ పాల్గొన్నారు.

బాధితుడికి విరాళం అందజేత

రామగిరి, ఆగస్టు 20: మండలంలోని రామగిరి బెస్తసేవాసంఘం ఆధ్వర్యంలో ఆస్పత్రిలో ఉన్న బాధితులకు మంగళవారం రూ.లక్ష విరాళాన్ని అందించారు. రొద్దం మండలం పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన బెస్తరామాంజనేయులు, బెస్తకోటేశ్వరరావులు కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో రామాంజనేయులు మృతిచెందగా కోటేశ్వరరావు కోమాలోకివెళ్లారు. అతనికి వైద్యచికిత్సలు అందించేందుకు బెంగళూర్ ఆస్పత్రిలో ఇబ్బందులు పడుతుండగా విషయం తెలుసుకున్న సంఘం సభ్యు లు రూ.3 లక్షల విరాళం సేకరించి ఆమొత్తాన్ని వారికి అందజేశారు. పేపర్ శీనా, నారాయణ, కటిక రామాంజనేయులు, శివ, మల్లికార్జున, గోవిందు పాల్గొన్నారు.



కంబదూరు మండలం జెక్కిరెడ్డిపల్లిలో వంకాయ తోటలో నిలిచిన వర్షపునీరు



పామిడి పెన్నానదిలో పారుతున్న వరదనీరు



శెట్టూరు మండలం అనుంపల్లిలో కల్వర్టు తెగిపోయి తేలియాడుతున్న పైపులు



ఉధృతంగా ప్రవహిస్తున్న యాడికి మండలం నిట్టూరు వంక

దంచికొట్టిన వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- జలమయమైన రోడ్లు ● నీటమునిగిన పంటలు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 20: మండలంలో మంగళవారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. 54.2 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు తెలిపారు. వ్రజ్రవన్నూరు, కొండాపురం, గ్రామదట్ల, ఆవులదట్ల, కొంతానపల్లి, కెంచానపల్లి, జుంజురంపల్లి, రేకులకుంట తదితర గ్రామాల్లో ఎడతెరపి లేని వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వ్రజ్రవన్నూరులోని బీసీ, ఎస్సీ కాలనీల్లో పలు ఇళ్లల్లోకి నీళ్లు చేరాయి. గ్రామదట్ల గ్రామంలో మొక్కజొన్న పంట నీటమునిగింది. ఉడేగోళంలో టమోట పంట నీట మునిగింది. మండలంలో రెండు హెక్టార్లలో టమోట, ఉల్లి, మొక్కజొన్న పంటలు నీటమునిగినట్లు హార్టికల్చర్ అధికారి మౌనిక తెలిపారు. వ్రజ్రవన్నూరు ఉన్నత పాఠశాలలోకి నీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బొమ్మక్కపల్లి సమీపంలో హైస్కూల్ వద్ద ఈదురుగాలులకు పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డుగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

గుత్తిలో 55.6 మి.మీల వర్షపాతం

గుత్తి: పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 55.6 మి.మీల మేరకు నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో వర్షపునీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఫారెస్ట్ కార్యాలయం, ఫుట్‌బాల్ గ్రౌండ్, తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున వర్షం నీరు నిలచింది.

ఉప్పొంగిన లచ్చానిపల్లి వంక

గుత్తిరూరల్: మండలంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి లచ్చానిపల్లి వంక ఉప్పొంగింది. దీంతో కసాపురం నుంచి గుత్తికి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పలు గ్రామాల్లో వంకలు పారాయి. గుత్తి మండల వ్యాప్తంగా 55.6 మిమీల వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ ఓబులేసు తెలిపారు.

పెన్నాకు జలకళ

పామిడి : పామిడి పెన్నాకు రెండేళ్ల తర్వాత జలకళ సంతరించుకుంది. రెండు రోజులు పాటు కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. దీంతో వరద నీరు పెన్నానదిలో ప్రవహించడంతో జలకళ వచ్చింది. రెండేళ్ల తర్వాత పెన్నాలో నీరు ప్రవహించడంతో పట్టణ ప్రజలు ఎంతో ఆనందంగా తిలకించారు. భూ గర్భ జలాలు పెంపొంది తాగు, సాగునీటి కష్టాలు తీరుతాయని ఆశాభావం వ్యక్తపరిచారు.

భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు

కళ్యాణదుర్గం(శెట్టూరు): మండలంలోని అనుంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అనుంపల్లి సమీపంలో ఉన్న కల్వర్టు కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో 44.4 మిమీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వర్షానికి పలు గ్రామాల్లో పంటల నీట మునిగాయి. అనుంపల్లి చెరువు మరువ పారి అనుంపల్లి - ములకలేడు మధ్య గల ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ములకలేడు గ్రామంలో తలారి ఓబుళనాయుడు అనే రైతుకు చెందిన రెండు ఎకరాల మిరపపంట నీట మునిగింది.

30.6 మిమీల వర్షపాతం నమోదు

బెళుగుప్ప: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. 30.6 మిమీల వర్షపాతం నమోదైంది. శీర్పి, బెళుగుప్ప, గంగవరం గ్రామాల చెరువులకు భారీగా నీరు చేరింది. వర్షపు నీరు బ్రిడ్జిల పై ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

పొలాల్లో నిలిచిన వర్షపునీరు

కళ్యాణదుర్గం: కంబదూరు మండలంలో జెక్కిరెడ్డిపల్లికి చెందిన మూలింటి నగేష్ సంబంధించిన మూడు ఎకరాల పొలంలో వంకాయ పంట గత 4 రోజులుగా కురుస్తున్న వర్షానికి నీటమునిగింది. పూత దశలో ఉన్న పంట వర్షార్పణం కావడంతో ఆ రైతు కన్నీటి పర్యంతం చెందారు. ఇంకా పలు గ్రామాల్లో పలు పంటలు నీట మునిగాయి.

నిట్టూరుకు రాకపోకలు బంద్

యాడికి: మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి నిట్టూరు వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో మంగళవారం ఉదయం నిట్టూరు గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. ఉదయం 8గంటల వరకు వంక ప్రవహిస్తూనే ఉంది. వాననీటి ప్రవాహ వేగం నిదానంగా తగ్గడంతో గ్రామస్తులు రాకపోకలు కొనసాగించారు.

కుండపోత వర్షం

పెద్దవడుగూరు: మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన కుండపోత వర్షంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. మండలకేంద్రంలోని పందులవాగు ఉధృతంగా ప్రవహించింది. లక్షుంపల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వర్షపునీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు.

జలదిగ్బంధంలో హనకనహాళ్

కణేకల్లు: మండలంలోని హనకనహాళ్ గ్రామం జలదిగ్బంధంలో ఇరుక్కుంది. గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామం చుట్టు ప్రక్కన ఉన్న వంకలు, వాగులు పొంగిపొర్లడంతో ఆ గ్రామానికి రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. ఈ గ్రామానికి రెండు ప్రధాన రహదారులు ఉన్న కణేకల్లు, బెళుగుప్ప గ్రామాల మధ్య గత రెండురోజులుగా వంకలు తీవ్రంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు అటు బెళుగుప్పకు వెళ్లలేక ఇటు కణేకల్లుకు వెళ్లలేక ఇబ్బందికరపరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

బొమ్మనహాళ్ మండలంలో భారీ వర్షం

బొమ్మనహాళ్: మండలంలో సోమవారం రాత్రిభారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు ఉద్దేహాళ్, ఉప్పరహాళ్, లింగదహాళ్ తదితర గ్రామాలలో భారీ వర్షం పడింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వేదావతిహగరి నదికి భారీ వరదనీరు చేరింది.

కొండాపురం చెరువుకు గండి

రాయదుర్గంరూరల్: మండలంలోని మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కొండాపురం చెరువుకు గండి పడింది. దీంతో నీరంతా వృథాగాపోతున్నట్లు గ్రామస్థులు వాపోయారు. అధికారులు నీరు వృథా కాకుండా గండిని పూడ్చాలని కోరారు.

నేమకల్లు రోడ్డులో ఎలుగుబంటి మృతి

బొమ్మనహాళ్, ఆగస్టు 20: మండలంలోని నేమకల్లు గ్రామ రోడ్డులో ఎలుగుబంటి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రోడ్డు పక్కనే ఎలుగుబంటి కళేబరాన్ని స్థానికులు గుర్తించి, రాయదుర్గం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు వెంటనే వచ్చి గుట్టుచప్పుడు కాకుండా కళేబరాన్ని అక్కడి నుంచి తరలించారు. ఎలుగుబంటి ఎలా మృతి చెందిందనే విషయాన్ని తెలపకుండానే ఖననం చేసినట్లు తెలుస్తోంది.



మృతి చెందిన ఎలుగుబంటి

ఘనంగా కేసీ నారాయణ జయంతి

గుంతకల్లు/ గుంతకల్లుటౌన్, ఆగస్టు20: టీడీపీ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కేసీ నారాయణ 84వ జయంతిని పట్టణంలోని కేసీ నారాయణ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్కే. నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో జయంతిని నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పామిడి, ఆగస్టు 20: పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త ఇల్లూరు నాగరాజు(50) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు ఆర్ ఆర్ రమేష్ వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.



నివాళులర్పిస్తున్న నాయకుడు రమేష్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పామిడి: మండలంలోని పాళ్యంతండా గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నారాయణస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి తెలుగు తమ్ముళ్లు మంగళవారం పరామర్శించి రూ. 26,500ల ఆర్థికసాయం అందజేశారు. టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్, జిల్లాకార్యదర్శి రాజేష్‌నాయక్, బూత్ కన్వీనర్ మల్లికార్జుననాయక్ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు ఆర్థికసాయం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 20: మండలంలోని మొలకలపెంటలో వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ తనయుడు ఆర్ ధర్మతేజ్‌గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని తన స్వగృహంలో మంగళవారం ఆయన ఆ గ్రామ పెద్దలకు రూ. 50వేలను అందజేశారు. గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్చెల్సీకి పైపింగ్

- ఎమ్మెల్యే చొరవతో పనులు పూర్తి

డీ.హీరేహాళ్, ఆగస్టు 20: తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే ఎగువకాలువకు పైపింగ్ పడిన సంఘటన మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. మండలంలోని నాగలాపురం గ్రామ సమీపంలో 117/200 కి.మీ వద్ద ఎడమవైపున పైపింగ్ పడింది. దీంతో నీరు వృథాగా బయటకు వెళ్లాయి. అటుగా వెళుతున్న రైతులు గమనించి హెచ్చెల్సీ లస్కర్లకు సమాచారం అందించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకొని పైపింగ్‌ను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెంటనే పైపింగ్‌ను యుద్ధప్రాతిపదికంగా పనులు పూర్తి చేయించాలని హెచ్చెల్సీ అధికారులను ఆదేశించారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్రగుంట వెంకటేశులు, టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి, నల్లాపురం బాబు జేసీబీ, హిటాచీ వాహనాలను ఏర్పాటు చేసి పైపింగ్ పడిన చోట పనులు పూర్తి చేయించారు. హెచ్చెల్సీ జేఈఈ అల్తాఫ్ దగ్గరుండి పనులు పూర్తి చేయించారు.

కోతకు గురైన కల్వర్టు పరిశీలన

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 20 : మండలంలోని అనుంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువు మరువ పారి అనుంపల్లి - ములకలేడు మధ్య గల ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. అలాగే కల్వర్టు కోతకు గురైంది. దీంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంగళవారం స్థానిక నాయకులతో కలిసి తెగిపోయిన కల్వర్టు పరిశీలించారు. తర్వాత ఫోన్ ద్వారా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య వివరించారు. అనంతరం మాట్లాడుతూ మూడు నెలల్లో కల్వర్టు నిర్మాణ పనులను పూర్తి చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అడవి గొల్లపల్లి, పాల వెంకటాపురం గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రహదారిని కూడా త్వరితగతిన మరమ్మతు చేస్తామన్నారు. ములకలేడు చెరువు నుంచి తూము ద్వారా వృథాగా వెళుతున్న నీటిని ఇసుక బస్తాలతో బైండింగ్ చేయిస్తామన్నారు. ములకలేడు సమీపంలో ప్రాథమిక పాఠశాల ఆవరణంలో అపరిశుభ్రంగా వుందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, శుభ్రం చేయించాలని రూ. 25 వేలను ఎంఈవో చేతుల మీదుగా హెచ్ఎంకు అందజేశారు.



తెగిపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి, ఆగస్టు20: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి మెకానికల్, ఆటోమొబైల్ టెక్నీషియన్ కోర్సును బోధించడానికి బీఈ, బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత ఉండాలన్నారు. అకౌంటెన్సీ టాక్సేషన్ విభాగంలో ఉన్న పోస్టుకు ఎంకాం ట్యాక్సేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు. పీరియడ్‌కు రూ.150చొప్పున నెలకు రూ.10వేలు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 24వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉరవకొండ, ఆగస్టు 20: వజ్రకరూరు మండలం పొట్టిపాడు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీరాములు, అనూష్ అనే యువకులు బైక్‌లో ఉరవకొండ నుంచి గుంతకల్లుకు బయలు దేరారు. పొట్టిపాడు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో వారిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉరవకొండలో చోరీ

ఉరవకొండ, ఆగస్టు20: పట్టణంలోని రంగావీధిలో నివాసముంటున్న వాణి అనే మహిళ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. వాణి వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇంటితాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడం గుర్తించారు. తర్వాత వారు ఇంటికి తాళాలు వేశారు. బాధితురాలు వస్తేనే చోరి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. బంగారు, నగదు ఎత్తుకెళ్లి ఉండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

15తులాల బంగారం అపహరణ

తాడిపత్రి, ఆగస్టు 20: మండలంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన దస్తగిరిరెడ్డి ఇంట్లో 15తులాల బంగారంను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారని రూరల్ పోలీసులు తెలిపారు. దస్తగిరిరెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్న మనవరాలిను చూడడానికి వారం క్రితం కుటుంబ సభ్యులతో సహా ఇంటికి తాళంవేసి వెళ్లాడు. దీన్ని అదునుగా చూసుకున్న గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలోని 15తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వచ్చిన దస్తగిరిరెడ్డి ఇంటి తాళాలు పగలగొట్టడం చూసి లోపలికి వెళ్లిచూడగా బంగారం చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి బాధితుని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో డ్రిప్ పరికరాల దగ్ధం

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 20: పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న కిషన్ డ్రిప్ ఫ్యాక్టరీలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.22 లక్షల విలువ జేసే డ్రిప్ పరికరాలు దగ్ధమైనట్లు నిర్వాహకుడు సాయికుమార్ తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించామని, సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారరని అన్నారు. దాదాపు రూ. 80 లక్షలు విలువ చేసే సామగ్రిని ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో కాపాడగలిగారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే డ్రిప్ పరికరాలకు నిప్పంటించారని ఆయన ఆరోపించారు.

కూలిన ఆరోగ్య ఉపకేంద్రం పైకప్పు

విడపనకల్లు, ఆగస్టు 20: మండలంలోని గడేకల్లు గ్రామంలో సోమవారం కురిన వర్షానికి ఆరోగ్య ఉప కేంద్రంలోని పైకప్పు మంగళవారం ఉదయం కూలింది. ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై బయటకు పరుగులు తీయటంతో ఎవరికీ ఏమీ కాలేదు. టీడీపీ నాయకులు ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకు వెళ్లారు.

ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన

గుంతకల్లుటౌన్,ఆగస్టు20: శ్రావణ మాసం మూడో మంగళవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆవోపా ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి లక్షతమలపాకుల అర్చన నిర్వహించారు. ఆలయంలో ఉదయం ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, సుగంధ అభిషేకాలు నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ చేశారు. తర్వాత లక్ష తమలపాకులతో అర్చన చేసి మహామంగళహారతి ఇచ్చారు.

అంజన్న ఆలయాల్లో శ్రావణ పూజలు



ప్రత్యేక అలంకరణలో నెట్టికంటి, నేమకల్లు, మురిడి ఆంజనేయస్వామి మూలవిరాట్‌లు

గుంతకల్లు/ బొమ్మనహాళ్/ డీ.హీరేహాళ్, ఆగస్టు 20: పవిత్ర శ్రావణమాసంలో వివిధ ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కసాపురం ఆలయంలో తెల్లవారుజామునే నెట్టికంటి ఆంజనేయ స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు, పుష్ప, స్వర్ణ కవచ అలంకారాలు చేసి, భక్తులకు దర్శనం కలిగించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం, సుందరకాండ పఠనాలను చేశారు. రాత్రి 8:30 గంటలకు సీతారామ లక్ష్మణ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పలంకరణ, విష్ణు పారాయణం, అష్టోత్తర పూజ లు నిర్వహించి చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. మురడి ఆంజనేయస్వామికి సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం కుంకుమార్చన, బిళ్వార్చన, సహస్ర నామార్చన తదితర అభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.

25 నుంచి ఉచితంగా డీఎస్సీ కోచింగ్: ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, ఆగస్టు 20: డీఎస్సీ, టెట్ అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీ నుంచి పట్టణంలోని టెక్స్‌టైల్స్ పార్క్‌లో ఉచితంగా కోచింగ్‌ను ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని తెలిపారు. దీంతో రాష్ట్రంలో 16వేల పైచిలుకు పోస్టులు భర్తీ కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం నియోజకవర్గంలో డీఎస్సీ అభ్యర్థులు ఎక్కువ మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హత సాధించాలనే ఆకాంక్షతో ఈ ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాయదుర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతం కాబట్టి నిరుపేద కుటుంబాల అభ్యర్థులు సుదూరప్రాంతాలకు వెళ్లి ఖరీదైన కోచింగ్‌ను తీసుకోవడం సాధ్యం కాదన్నారు. కనుక ఇక్కడే వారి కోసం టెట్, డీఎస్సీ కోచింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా సబ్జెక్టుల్లో ప్రావీణ్యం పొందిన 12 మంది ట్రైనర్లను కోచింగ్ కోసం రప్పిస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 353 మంది అభ్యర్థులు ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాయదుర్గం పట్టణం నుంచి 117 మంది, రాయదుర్గం మండలం నుంచి 54 మంది, కణేకల్లు మండలం నుంచి 26 మంది, గుమ్మఘట్ట మండల నుంచి 56 మంది, డీ.హీరేహాళ్ మండలం నుంచి 29 మంది, బొమ్మనహాళ్ మండలం నుంచి 11 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 25వ తేదీన ఉదయం 10 గంటలకు కోచింగ్ ప్రారంభించనున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎక్కువ మంది ఉపాధ్యాయ పోస్టులను పొందాలని ఆయన ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

పురాతన ఆలయాల సందర్శన

కుందుర్పి, ఆగస్టు 20: మండల కేంద్రంలోని పురాతన ఆలయాలను రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాలల శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రజిని, సాంకేతిక సహాయకుడు మహేంద్ర నాయుడు స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి మంగళవారం సందర్శించారు. శివాలయం, చెన్నకేశవ ఆలయాలను సందర్శించారు. మలయనూరు గ్రామంలో పురాతన ఆలయమైన పంచ శివాలయాన్ని సందర్శించి అక్కడి శిల్ప కళలను పరిశీలించారు. ఈ పురాతన ఆలయాలను కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించి వాటి చరిత్రను వెలుగులోకి తెస్తామని అధికారులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

- సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ఎమ్మెల్యే గుమ్మనూరు పిలుపు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 20: పార్టీలకు అతీతంగా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎందుకు రాలేదని ఎంపీడీఓను అడిగారు. సమావేశానికి రాని వారికి నోటీసులు జారీచేస్తామని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఎప్పుడూ లేని విధంగా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా గ్రామాల అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులను నిర్మిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రగతిని చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కసాపురం గ్రామానికి వచ్చిన శానిటేషన్ స్వచ్ఛంద మిషన్‌కు పూజ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పెద్దారెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారు

తాడిపత్రి, ఆగస్టు20: మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి వచ్చినప్పటి నుంచి గొడవలు జరుగుతున్నాయన్నారు. రెండునెలలుగా ప్రశాంతంగా ఉన్న ఊరు మాజీ ఎమ్మెల్యే రాకతో మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయన్నారు. మరోసారి ఇలా జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఆయన తాను ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ఫ్యాక్షన్ మొదలుపెడతానని చెప్పారని, ఇప్పుడు అదేవిధంగానే హింసను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తాడిపత్రిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు.

ఎత్తిపోతల ద్వారా చెరువులకు నీరు విడుదల

యల్లనూరు, ఆగస్టు20: మండలంలోని గండికోట చిత్రావతి ఎత్తిపోతల పథకం ద్వారా యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులకు అధికారులు మంగళవారం నీటిని విడుదల చేశారు. పాలూరు పంప్‌హౌస్ నుంచి యల్లనూరు చెరువుకు, కోడిమూర్తి పంప్‌హౌస్ నుంచి గడ్డంవారిపల్లి చెరువుకు ఒక పంపు ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ రెండు చెరువులు నిండిన తర్వాత దుగ్గుపల్లి పంప్‌హౌస్ నుంచి గొడ్డుమర్రి ఆనకట్టకు పంపింగ్ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ రెండు చెరువులు పూర్తికావడానికి వారం రోజులు సమయం పడుతుందన్నారు.

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన సభ్యులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 20 : పట్టణంలో మంగళవారం ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు.. ఇందులో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించి నూతన కమిటీ ఎంపిక జరిగింది. పట్టణ అధ్యక్షుడిగా రమేష్‌బాబు, కార్యదర్శిగా కొత్తపల్లి బాబు, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రాము, జీన్స్ జేవియర్, సురేంద్ర, జాయింట్ సెక్రెటరీగా దొనతిమ్మప్ప, అరుణ్, కే భాస్కర్, సలహాదారులుగా శివలింగారెడ్డి ఎంపికయ్యారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

గుత్తిరూరల్, ఆగస్టు 20: ఇసురాళ్లపల్లిలో గల ఆనంద ఆశ్రమంలో రాఘవేంద్రస్వామి 86వ ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాగునీరు పొలానికి మళ్లింపు

- అధికారులపై సర్పంచ్ ఆగ్రహం

ఉరవకొండ, ఆగస్టు20: మండలంలోని నింబగల్లు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి ఫిల్టర్ బెడ్లులోకి వదిలిన నీటిని పొలాలకు మళ్లించుకుంటున్నారు. గత మూడేళ్ల నుంచి ఈ తంతు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారు. ఈ సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నుంచి వ్యాసాపురం, నెరమెట్ల, రాయంపల్లి గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. కాలువకు నీళ్లు రావడంతో మంగళవారం నీటి పంపింగ్‌ను పరిశీలించేందుకు సర్పంచ్ సీతారాములు అక్కడికి వెళ్లారు. ఫిల్టర్ బెడ్లులోకి వదులుతున్న నీరు ఎక్కడకు పోతున్నాయని గమనించగా.. మోటారు ద్వారా ఓ పొలానికి నీటి పంపింగ్ జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్లుకు గండి కొట్టి ఓ కానిస్టేబుల్ తన పొలానికి నీళ్లు మళ్లించుకుంటున్నాడని, ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. తాగే నీటిని పొలానికి మళ్లిస్తున్న కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అధికారులను కోరారు.

తూముకు పడిన రంధ్రం పూడ్చివేత

బ్రహ్మసముద్రం, ఆగస్టు 20: మండలంలోని సంతేకొండాపురం గ్రామ పంచాయతీ కొండాపురం గ్రామంలోని పెద్దచెరువు తూముకు రంధ్రం పడి వర్షపు నీరు వృథా అవుతోంది. దీంతో గ్రామస్థులు మంగళవారం సర్పంచ్‌కు , అధికారులకు తెలియజేయడంతో వారు వెంటనే వచ్చి రంధ్రం పూడ్చి వేసి నీటి వృథాను అరికట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల వనిత, ఇరిగేషన్ ఏఈ దామోదర్, టీడీపీ నాయకులు నరసింహులు, యర్రిస్వామి, నాగరాజు, వీఆర్ఏ నాగరాజు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

కూడేరు, ఆగస్టు 20 : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముద్దలాపురం, ఇప్పేరు, కమ్మూరు తదితర గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తమ గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు. అలాగే వీధిలైట్లను మరమ్మతు చేయించాలని అన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్, ఆగస్టు 20: మండలకేంద్రంలో మంగళవారం ఏపీటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం 117 జీఓ లాంటి అశాస్త్రీయ ఆలోచనల ఫలితంగా విద్యారంగంలో అనేక సమస్యలు చుట్టుముట్టాయన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కేటీ రంగప్రసాద్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బహేశ్వర, ఎస్ రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి యూ రామాంజనేయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుమ్మఘట్ట, ఆగస్టు 20 : మండలంలోని తాళ్లకెర గ్రామంలో అశోక్ అనే యువకుడు ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామానికి చెందిన బోయ లక్ష్మీదేవి కుమారుడు అశోక్ ఓ అమ్మాయిని ప్రేమించాడు. కాగా ప్రేమ విఫలం కావడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం మితిమీరిన మద్యం సేవించి పాఠశాల ఆవరణలో ఉన్న నీటి ట్యాంకుపైకి ఎక్కిదూకాడు. తీవ్ర గాయాలవడంతో స్థానికులు వెంటనే రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అసత్య ఆరోపణలు సరికాదు

పామిడి, ఆగస్టు 20: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సేవలపై అసత్య ఆరోపణలు చేయడం తగదని వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పామిడి ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అయితే ఇటీవల కొందరు ఉద్దేశ్యపూర్వకంగా అసత్య ఆరోపణలు, ఫిర్యాదులు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.